# బీజేపీతో మాకు స్నేహం లేదు

## 4 స్థానాల్లో ఆ పార్టీ అభ్యర్థులను ఓడించినం

## మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి



హైదరాబాద్, ఫిబ్రవరి 9(నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్‌కు బీజేపీతో ఎలాంటి స్నేహం లేదని మాజీ స్పీకర్, బీఆర్ఎస్ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి స్పష్టంచేశారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ సందర్భంగా శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ఆరోపణలను పోచారం తప్పుబట్టారు. బీఆర్ఎస్.. బీజేపీ ఫ్రెండ్లీ పార్టీ అనడాన్ని రికార్డులనుంచి తొలగించాలని కోరారు.

### రుణమాఫీని వెంటనే అమలుచేయాలి: పాయల్ శంకర్, ఎమ్మెల్యే, ఆదిలాబాద్



కాంగ్రెస్ ఎన్నికల హామీ ప్రకారం రైతులకు ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీని వెంటనే అమలుచేయాలని బీజేపీ శాసనసభ్యుడు పాయల్ శంకర్ కోరారు. ఆరు గ్యారెంటీలు, ఎన్నికల హామీలను ఎప్పటివరకు అమలుచేస్తారో గవర్నర్ ప్రసంగంలో చెప్పలేదని అన్నారు. ఆదిలాబాద్ దవాఖానలో డాక్టర్ల నియామకం, డిఫెన్స్ ఎయిర్‌పోర్టు అభివృద్ధి చేసి అందుబాటులోకి తేవాలని కోరారు.

### బీఆర్ఎస్ పాలనలో హిందూముస్లిం ఐక్యత వర్ధిల్లింది: అక్బరుద్దీన్ ఒవైసీ



దేశవ్యాప్తంగా మతతత్వం క్యాన్సర్ కన్నా వేగంగా వ్యాప్తి చెందుతున్నదని, తెలంగాణకు కూడా అది పాకుతున్నదని ఎంఐఎం పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ ఆందోళన వ్యక్తంచేశారు. ముస్లింలు ఎస్సీ, ఎస్టీలకన్నా వెనుకబడి ఉన్నట్టు సచార్ కమిటీ, రంగనాథ్ కమిషన్ సైతం పేర్కొన్నాయని గుర్తుచేశారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణలో గంగా జమునా తహజీబ్ వర్ధిల్లిందని కొనియాడారు.

### నియోజకవర్గానికో స్మాల్‌స్కేల్ ఇండస్ట్రీ : కూనంనేని సాంబశివరావు



ఒక్కో నియోజకవర్గానికి ఒక స్మాల్‌స్కేల్ ఇండస్ట్రీని ఏర్పాటు చేయాలని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కోరారు. హెచ్ఎండీఏ అధికారి శివబాలకృష్ణ అవినీతి బాగోతం బయటపడిన తరువాత సోమేశ్‌కుమార్ పేరుకూడా బయటకు వచ్చిందని, తమవద్ద అలాంటి చాలామంది పేర్లు ఉన్నాయని, ప్రభుత్వం కోరితే అందిస్తామని చెప్పారు.

### ఎంపీ టికెట్ కోసమే జగ్గారెడ్డి రేవంత్ జపం: మాజీ మంత్రి మల్లారెడ్డి



ఎంపీ టికెట్ కోసమే రేవంత్‌రెడ్డిని జగ్గారెడ్డి పొగుడుతున్నారని మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి ఆరోపించారు. తన పేరు చెప్పకపోతే జగ్గారెడ్డిని ఎవరూ పట్టించుకోరని, అందుకే తన పేరును వాడుతున్నారని ఎద్దేవాచేశారు. గతంలో రేవంత్ రెడ్డిపై జగ్గారెడ్డి చేసిన విమర్శలు అందరికీ గుర్తుకు వస్తున్నాయని చెప్పారు.

### చెక్‌పోస్టుల్లో కొత్తవారికి అవకాశం: మంత్రి పొన్నం ప్రభాకర్



మోటార్ వెహికిల్ ఇన్ స్పెక్టర్ పోస్టింగుల్లో పారదర్శకతకే పెద్దపీట వేస్తామని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. చెక్‌పోస్టుల వద్ద పనిచేయని వారికి పోస్టింగుల్లో ప్రాధాన్యత ఇస్తామని, తక్కువ కాలం పనిచేసిన వారికి అవకాశం ఇస్తామ న్నారు.

### ఆప్షనల్ హాలిడేగా సేవాలాల్ జయంతి: మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



గిరిజనుల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని ఆప్షనల్ హాలిడేగా ప్రభుత్వం నిర్ణయించినట్టు ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలతో కలిసి మంత్రి కోమటిరెడ్డి విలేకరులతో మాట్లాడారు.

### గొల్ల-కురుమలకు కార్పొరేషన్:ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



రాష్ట్రంలో గొల్ల-కురుమలకు కార్పొరేషన్ ఏర్పాటు చేసేందుకు సీఎం అంగీకరించారని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు గొల్ల-కురుమల కార్పొరేషన్‌కు సీఎం ఆమోదం తెలిపారని చెప్పారు.

### సేవాలాల్ విగ్రహ ప్రకటన హర్షణీయం: ఎమ్మెల్యే బాలునాయక్



సేవాలాల్ జయంతిని ఆప్షనల్ హాలిడేగా ప్రకటించడం, హైదరాబాద్‌లో సేవాలాల్ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి ఆమోదం తెలపడం పట్ల దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ నెల 14 నుంచి 16 వరకు ప్రభుత్వం ఆధ్వర్యంలో జయంతి ఉత్సవాలు జరుగుతాయని వెల్లడించారు.

### సభా సమయాన్ని వృథా చేసిందే సీఎం రేవంత్: ఎమ్మెల్సీ మధుసూదనాచారి



మండలికి రాకుండా, సభ్యులకు క్షమాపణ చెప్పకుండా శుక్రవారం సభాసమయం వృథా అయ్యేందుకు సీఎం కారణమయ్యారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ మధుసూదనాచారి అన్నారు. మండలి సభ్యులపై సీఎం వ్యాఖ్యలు గర్హనీయమని, శుక్రవారం మండలికి సీఎం రావాలని, సభ్యులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.



### సీఎం వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరం:ఎమ్మెల్సీ భానుప్రసాద్

మండలి సభ్యుల పట్ల సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతకరంగా ఉన్నాయని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ భానుప్రసాద్ అన్నారు. పీవీకి భారతరత్న ఇవ్వాలని బీఆర్ఎస్ హయాంలో మండలిలో తీర్మానం చేసి, కేంద్రానికి పంపినట్టు గుర్తుచేశారు.

### టీచర్లను ఉపయోగించుకోండి: ఎమ్మెల్సీ నర్సిరెడ్డి



రాష్ట్రంలో ఉన్న 1.4 లక్షల మంది ఉపాధ్యాయులను సరైన పద్ధతిలో ఉపయోగించుకొని.. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని టీచర్ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి కోరారు. కొత్త ప్రభుత్వం సీపీఎస్ రద్దుపై సరైన వివరణ ఇవ్వాలని కోరారు.



### బస్సుల సంఖ్యను పెంచాలి: ఎమ్మెల్యే సునీత

ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించడాన్ని స్వాగతిస్తున్నట్టు నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి చెప్పారు. అసెంబ్లీలో ఆమె మాట్లాడుతూ.. రద్దీ దృష్ట్యా బస్సుల ట్రిప్పుల సంఖ్యను పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు.

# రాజ్యాంగ హోదాల్లో ఉన్నవారు రాజకీయాలకు దూరంగా ఉండాలి కదా?

- ఎమ్మెల్సీల కేసులో హైకోర్టు ప్రశ్న
- తదుపరి విచారణ 12కి వాయిదా

హైదరాబాద్, ఫిబ్రవరి 9 (నమస్తే తెలంగాణ): గవర్నర్ లాంటి రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారు రాజకీయాలకు దూరంగా ఉండాలి కదా? అని హైకోర్టు ప్రశ్నించింది. గవర్నర్ కోటాలో ఇటీవల ఎమ్మెల్సీలుగా నియమితులైన కోదండరాం, అలీఖాన్ నేపథ్యం ఏమిటని నిలదీసింది. దాసోజు శ్రవణ్, కుర్రా సత్యనారాయణను ఎమ్మెల్సీలుగా నియమించాలన్న గత బీఆర్ఎస్ ప్రభుత్వ సిఫారసును గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ తిరస్కరించడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే అనిల్ కుమార్ ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది. గవర్నర్ కార్యాలయం తరపున సీనియర్ న్యాయవాది ఎస్ అశోక్ నంద కుమార్ వాదిస్తూ.. గవర్నర్ అంటే రబ్బరు స్టాంపు కాదని, గవర్నర్ నిర్ణయం రాజ్యాంగానికి లోబడే ఉన్నదని అన్నారు. కోదండరాం, అలీఖాన్ అధికార పార్టీకి చెందిన వ్యక్తులు కాదనే విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలని సూచించడంతో తదుపరి విచారణను 12కు వాయిదా వేస్తున్నట్టు ధర్మాసనం ప్రకటించింది.

# అతిశ్రద్ధ ఎందుకు?

- మాజీ ఎమ్మెల్యే షకీల్ కేసులో పోలీసులను నిలదీసిన హైకోర్టు

హైదరాబాద్, ఫిబ్రవరి 9 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లోని ప్రజాభవన్ (ప్రగతి భవన్) వద్ద బారికేడ్లను ఢీకొట్టిన కేసులో పోలీసులు ఎందుకు అతిశ్రద్ధ చూపుతున్నారని హైకోర్టు ప్రశ్నించింది. సాధారణ వ్యక్తులపై కేసు నమోదైనప్పుడు కూడా ఇదేవిధంగా వ్యవహరిస్తారా? అని నిలదీసింది. ఈ కేసులో బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్, మరో ఇద్దరికి వ్యతిరేకంగా పోలీసులు జారీచేసిన లుకౌట్ నోటీసు అమలును నిలిపివేసింది. వారిని అరెస్టు చేయరాదని, సీఆర్పీసీలోని సెక్షన్ 41ఏ కింద నోటీసు జారీచేసి చట్టప్రకారం విచారణ చేయాలని స్పష్టం చేసింది. ఈ నెల 23లోగా పిటిషనర్లు పోలీసుల ఎదుట హాజరై విచారణకు సహకరించాలని జస్టిస్ కే లక్ష్మణ్ శుక్రవారం ఉత్తర్వులిచ్చారు.

# 30 మోసాలు.. 60 అబద్ధాలు

**చట్టసభల్లో అబద్ధాలు చెప్పడం తీవ్ర నేరం**

**మార్పు అంటే నంబర్ ప్లేట్లు మార్చడమా?**

- ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొనిరావాలి
- ఆటో రుణమాఫీ పథకం ప్రవేశపెట్టాలి
- ఆరు గ్యారెంటీలకు ఎంత కేటాయిస్తారు?
- తెలంగాణను ఒకరు ఇవ్వలె.. కొట్లాడి తెచ్చుకున్నాం
- కేంద్రంతో లోపాయికారి ఒప్పందాన్ని ప్రజలు సహించరు
- ప్రగతిభవన్ గతంలోనూ ప్రజాభవనే..
- గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 9 (నమస్తే తెలంగాణ): గవర్నర్‌తో ముప్పై మోసాలు, అరవై అబద్ధాలు చెప్పించారని, అరచేతిలో వైకుంఠం చూపించారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి విమర్శించారు. చట్టసభల్లో అబద్ధాలు చెప్పడం తీవ్రమైన నేరమని పేర్కొన్నారు. మార్పు అంటే నంబర్ ప్లేట్లు మార్చడం కాదని, ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావాలని ప్రభుత్వానికి సూచించారు. 'వ్యవసాయవర్సిటీ భూములు తీసుకోవద్దని విద్యార్థులు ఆందోళన చేస్తుంటే సిగలు పట్టుకుని ఈడ్చుకెళ్లారు. కాంగ్రెస్ నేతలు ఓయూకు వెళ్తే అరెస్టులు చేస్తున్నారు. భవనాల పేర్లు మార్చడం, ధరణిని భూమాతగా పేరు మార్చడమే మార్పా?' అని నిలదీశారు. అసెంబ్లీలో శుక్రవారం ఆయన గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై బీఆర్ఎస్ పక్షాన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రాన్ని ఎవ్వరూ ఇవ్వలేదని, కొట్లాడి తెచ్చుకున్నామని, కేసీఆర్ సాధించారని స్పష్టంచేశారు. దేశ స్వాతంత్ర్యం కోసం గాంధీ, నెహ్రూ, పటేల్ పోరాడింది ఎంత నిజమో.. తెలంగాణ కోసం కేసీఆర్ పోరాడింది అంతే నిజమని చెప్పారు. 'కాంగ్రెస్ ఇచ్చింది. సోనియా ఇచ్చింది.. అంటున్న వారు మనం స్వాతంత్ర్యం తెచ్చుకోలేదు.. బ్రిటీషువాళ్లే ఇచ్చారంటే ఒప్పుకుంటారా?' అని ప్రశ్నించారు.

### ఆరు గ్యారెంటీలపై అబద్ధాలు

ఆరు గ్యారెంటీల గురించి గవర్నర్ ప్రసంగంలో అబద్ధాలు చెప్పారని పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక గ్యారెంటీలో ఒక పథకాన్ని మాత్రమే అమలు చేశారని మండిపడ్డారు. ఆరు గ్యారెంటీలు, 13 అంశాలకు బడ్జెట్‌లో ఎంత కేటాయిస్తారో ప్రకటించాలని డిమాండ్ చేశారు. 13 హామీలిచ్చి రెండు పూర్తి చేశామని చెప్పుకోవడం సరికాదని చురకలేశారు. ఆరోగ్యశ్రీ పథకం కింద రూ.20 కోట్లు ఖర్చు చేస్తే రూ.60 కోట్ల ప్రచారం చేసుకున్నారని ఎద్దేశా చేశారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలోని అంశాలు గవర్నర్ ప్రసంగంలో లేవని, హామీల ఊసే లేదని దుయ్యబట్టారు. కౌలురైతులను విస్మరించారని విమర్శించారు. ప్రమాణ స్వీకారం రోజే రైతు రుణమాఫీ చేస్తామన్న హామీ ఏమైందని నిలదీశారు. రైతుభరోసా సాయం పెంచలేదని, వరికి 500 బోనస్‌ను యాసంగికైనా ఇస్తారా? మోసగిస్తారా? అని నిలదీశారు. ఆర్టీసీ ఉద్యోగులను వెంటనే ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు.

### ప్రగతిభవన్ గతంలోనూ ప్రజాభవనే

ప్రగతిభవన్ కంచెలు బద్దలు కొట్టామని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ ముందు కొత్త కంచెలు పెట్టిందని, పోలీసు

అసెంబ్లీ ఆవాజ్

బడ్జెట్ సమావేశాలు



> జర్నలిస్టులకు రూ.100 కోట్లు కేటాయించింది.. అంగన్‌వాడీలకు అన్నం పెట్టింది.. దళిత బంధు, రైతుబంధుకు శ్రీకారం చుట్టింది.. సింగరేణి కార్మికుల సమస్యలు తీర్చింది ప్రగతిభవనే.
>
> **- పల్లా రాజేశ్వర్‌రెడ్డి**

గస్తీని పెంచిందని పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఎద్దేవా చేశారు. ప్రగతిభవన్ గతంలో కూడా ప్రజాభవనేనని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం ప్రగతిభవన్‌లో ఎన్నో సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టిందని వివరించారు. సీఎం కనీసం వారానికి ఒక్కసారి కూడా ప్రజావాణికి హాజరుకాలేదని విమర్శించారు. 60 రోజుల్లో ప్రజావాణిలో ఎన్ని సమస్యలు పరిష్కరించారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 60 రోజుల్లో కొన్ని నిమిషాలపాటు సీఎం, మంత్రులు వినతులు స్వీకరిస్తే ప్రజాపాలన ఎట్లా అవుతుందని ప్రశ్నించారు. గత పదేండ్లలో ప్రగతిభవన్ ప్రజాభవన్‌గా విరాజిల్లిన విషయాన్ని విస్మరించరాదని చెప్పారు.

### ఆటో రుణమాఫీ చేయాలి

రైతు రుణమాఫీ తరహాలో ఆటో రుణమాఫీ పథకాన్ని ప్రవేశపెట్టాలని, ఆటోడ్రైవర్లకు నెలకు రూ.10 వేలు ఇవ్వాలని పల్లా రాజేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించి, బస్సుల సంఖ్య, ట్రిప్పుల సంఖ్య పెంచలేదని చెప్పారు. కాంగ్రెస్ తీరుతో ఆరున్నర లక్షల మందికిపైగా ఆటో డ్రైవర్ల జీవితాలు ప్రమాదంలో పడ్డాయని ఆందోళన వ్యక్తంచేశారు. రెండు నెలల్లో 21 మంది ఆటోడ్రైవర్లు ఆత్మహత్య చేసుకున్నారని చెప్పారు. ఆత్మహత్య చేసుకున్న వారి కుటుంబాలకు రూ.20 లక్షల చొప్పున పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ కేసీఆర్ ప్రభుత్వం జారీ చేసిన జీవోను అమలుచేయాలని డిమాండ్ చేశారు.

### బీజేపీతో కుమ్మక్కయ్యారా?

కేంద్రం రాష్ట్రానికి రూపాయి ఇవ్వకపోయినా ముఖ్యమంత్రి నుంచి మంత్రుల వరకు ఒక్కరూ నోరు మెదపడంలేదని, బీజేపీతో కుమ్మక్కయ్యారా? అని పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రశ్నించారు. కేంద్ర బడ్జెట్‌లో అన్యాయాలపై కర్ణాటక, కేరళ సీఎంలు ధర్నాలు చేస్తున్నారని, న్యాయబద్ధంగా వాటా సాధించేందుకు రాష్ట్రం తరఫున ఎందుకు పోరాడటం లేదని నిలదీశారు. కేంద్రంతో లోపాయికారి ఒప్పందం చేసుకుంటే తెలంగాణ సమాజం సహించదని హెచ్చరించారు. కేంద్రంతో కొట్లాడేందుకు తాము కూడా ప్రభుత్వంతో కలిసి వస్తామని, నిలదీద్దామని సూచించారు. ప్రతి నెలా రూ.4 వేల చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామన్న ప్రియాంకగాంధీ డిక్లరేషన్‌కే దిక్కులేదని ఎద్దేవా చేశారు. రాజకీయ నాయకులను, ఈ రాష్ట్రంతో సంబంధంలేని వాళ్లను టీఎస్‌పీఎస్సీ సభ్యులుగా నియమించారని ఆరోపించారు. ఔట్‌సోర్సింగ్, అడ్‌హక్, టెంపరరీ ఉద్యోగులకు రెగ్యులర్ ఉద్యోగులతో సహా ఒకటో తేదీనే జీతాలివ్వాలని కోరారు. తాము టీఎస్‌పీఎస్సీ సహా 10 సంస్థల ద్వారా 1.6 లక్షల ఉద్యోగాలను భర్తీచేశామని చెప్పారు.

### సీఎం రాగానే మారిన సీన్

డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతున్నంత సేపు మంత్రులు, అధికారపక్షం సభ్యులు పదేపదే అడ్డుపడ్డారు. తొలుత మంత్రి శ్రీధర్ బాబు పల్లా వ్యాఖ్యలపై స్పందించారు. పల్లా తన ప్రసంగాన్ని కొనసాగిస్తుండగా సీఎం రేవంత్‌రెడ్డి రాగానే సీన్ మారింది. సీఎం సభలో ఉన్నంతసేపు అధికారపక్షం పల్లాపై ఎదురుదాడికి దిగింది. మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, సీతక్క అడ్డుతగలారు. ఆ తర్వాత ప్రభుత్వ విప్‌లు బీర్ల ఐలయ్య, ఆది శ్రీనివాస్ సైతం కల్పించుకుని మాట్లాడారు. సీఎంను ప్రసన్నం చేసుకునేందుకు మంత్రులు, విప్‌లు తాపత్రయపడుతున్నట్టుగా కనబడుతున్నదని అధికారపక్షం దాడిని పల్లా తిప్పికొట్టే ప్రయత్నం చేశారు. బెదిరిస్తున్నారా? అంటూ అధికారపక్షాన్ని నిలదీశారు.

### ఆ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించండి: ప్రశాంత్‌రెడ్డి

ఆటో డ్రైవర్ల పరిస్థితిపై పల్లా మాట్లాడుతుండగా, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సభలో చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. యాదగిరిగుట్ట అభివృద్ధి పేరుతో వైటీడీఏను అడ్డాగా మార్చుకుని కల్వకుంట్ల కవిత, జగదీశ్‌రెడ్డి దోచుకున్నారని ఆరోపించారు. ఈ వాఖ్యలపై బీఆర్ఎస్ సభ్యులు నిరసన వ్యక్తంచేశారు. కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ వెల్‌లోకి దూసుకెళ్లారు. దీంతో జగదీశ్‌రెడ్డి ఆయనను శాంతింపజేసి వెనక్కి తీసుకొచ్చారు. బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. సభలోని లేని వారి గురించి ఆరోపణలు చేయడం తగదని, ఆ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని స్పీకర్‌ను కోరారు.

### అభివృద్ధి విషయంలో భేషజాల్లేవు: శ్రీధర్‌బాబు

అభివృద్ధి విషయంలో భేషజాల్లేవని, ఆర్థిక ప్రగతి విషయంలో రాజీపడబోమని మంత్రి శ్రీధర్‌బాబు స్పష్టంచేశారు. 'అదానీ క్రోనీ క్యాపిటలిస్టు. మోదీ అంతా అదానీకి దోచిపెడుతున్నారని రాహుల్ విమర్శిస్తే.. అదే కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో 12 వేల కోట్ల పెట్టుబడులకు ఒప్పందం చేసుకున్నదని, ఇదేం విధానమని రాజేశ్వర్‌రెడ్డి ప్రశ్నించారు. దీనిపై మంత్రి శ్రీధర్‌బాబు రాష్ట్ర ప్రగతిలో భాగస్వామ్యమయ్యేందుకు వచ్చే వారిని, పెట్టుబడులను స్వాగతిస్తామని స్పష్టంచేశారు. దేశ సంపద కొందరి చేతుల్లోకి వెళ్లొద్దన్నదే తమ విధానమని, చిన్న తరహా పరిశ్రమలను ప్రోత్సహించేందుకు ఎంఎస్ఎంఈ పాలసీని తీసుకొస్తామని, తమది సంక్షేమ, అభివృద్ధి పాలన అని చెప్పారు.

### కవితతో ముగించిన 'పల్లా'

పల్లా రాజేశ్వర్‌రెడ్డి తన ప్రసంగాన్ని కవితతో ముగించారు. ఒక కవి రాసిన కవితను సభలో చదివి వినిపించారు. దీంతో బీఆర్ఎస్ సభ్యులంతా బల్లలు చరిచి పల్లాను అభినందించారు.

- అధికారం వచ్చిందని అహంకారపడుతున్నరు.
- ప్రాజెక్టుల హక్కులను పరాయిలకిచ్చిండ్రు
- ఇదేనా మార్పు అంటే అంతెత్తున దూకుతున్నరు
- తిట్ల పురాణం పెట్టి తిక్క తిక్కచేస్తున్నరు.
- విన్నవా కాళోజీ? కాంగ్రెస్ పాఠం
- మొదటికే మోసం తెచ్చిన మొండి చేయి వాటం

జై తెలంగాణ అంటూ తన ప్రసంగాన్ని ముగించారు.

### పీవీ, జయశంకర్, కొండా బాపూజీకి గౌరవం ఇచ్చిందే బీఆర్ఎస్

బీఆర్ఎస్ ప్రభుత్వం మాజీ ప్రధాని పీవీతోపాటు ప్రొఫెసర్ జయశంకర్, కొండా లక్ష్మణ్ బాపూజీని సముచితంగా గౌరవించిందని పల్లా రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. కవులను, కళాకారులను గుర్తించలేదనడం సరికాదని పేర్కొన్నారు. గోరటి వెంకన్నకు ఎమ్మెల్సీ ఇచ్చి గౌరవించామని, ఉద్యాన వర్సిటీకి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు, వ్యవసాయవర్సిటీకి జయశంకర్ పేరు, వెటర్నరీవర్సిటీకి పీవీ పేరు పెట్టినట్టు గుర్తుచేశారు. గద్దర్ అనారోగ్యంగా ఉంటే ఆయనకు దవాఖానలో ఏర్పాట్లు తానే చేశానని, ఆయన మరణించిన తర్వాత పార్థివదేహాన్ని ఎల్బీ స్టేడియంకు తీసుకొచ్చి, అంత్యక్రియలు పూర్తయ్యే వరకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని చెప్పారు. నాటి సీఎం కేసీఆర్.. గద్దర్ ఇంటికి వచ్చి నివాళులు అర్పించారని గుర్తు చేశారు. హైదరాబాద్‌ను అభివృద్ధి చేస్తామని చెప్తున్న సీఎం రేవంత్‌రెడ్డి.. ప్రస్తుత చిహ్నంలోని చార్మినార్‌ను ఎందుకు తొలగించాలని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు ఎందుకు ప్రొటోకాల్ ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఇటీవల జిల్లా మంత్రులకు రూ.10 కోట్లు విడుదల చేశారని, తమ ఎమ్మెల్యేలకు కూడా అభివృద్ధి నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# ప్రతిపక్ష ఎమ్మెల్యేల 'లైవ్' తీసుకోవద్దు

- జర్నలిస్టులకు అసెంబ్లీ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ హుకుం
- ఇదేమని అడిగితే పైనుంచి ఆదేశాలని వెల్లడి
- అడుగడుగునా ఆంక్షలు.. అనవసరపు బారికేడ్లు

హైదరాబాద్, ఫిబ్రవరి 9 (నమస్తే తెలంగాణ): మునుపెన్నడూ లేని విధంగా ఇటు అసెంబ్లీలో, అటు మండలిలో పోలీసుల ఆంక్షలు ఎక్కువయ్యాయి. అసెంబ్లీ ఆవరణలో ఎక్కడ చూసినా అనవసరపు బారికేడ్లే దర్శనమిస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వంలో పోలీసులు హద్దు మీరు ప్రవర్తిస్తున్నారు. బడ్జెట్ సమావేశాల సందర్భంగా శుక్రవారం మీడియా అపాయింట్ నుంచి అసెంబ్లీ ప్రాంగణం వైపు వెళ్లేందుకు మీడియాపై అనేక ఆంక్షలు విధించారు. జర్నలిస్టుల వివరాలు నమోదు చేసుకొని లోపలికి పోనిచ్చారు. ఇదేమిటని ప్రశ్నించగా.. తమకు పైనుంచి ఆదేశాలు వచ్చాయని.. తప్పకుండా వివరాలు ఇవ్వాల్సిందేనంటూ.. జర్నలిస్టు పేరు, ఫోన్ నంబర్, పనిచేస్తున్న మీడియా వివరాలు తీసుకున్నారు. ఐడీ కార్డులను చూపిస్తూ దాదాపు నాలుగు దశలను దాటుకొని వచ్చినా.. మళ్లీ పోలీసులు వివరాలు అడగటం పట్ల కొందరు జర్నలిస్టులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై కొందరు జర్నలిస్టులు అసెంబ్లీ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్‌కు ఫిర్యాదు చేయడంతో సాయంత్రం తర్వాత వివరాలు తీసుకోవడం మానేశారు. మరోవైపు మండలిలో సైతం ఇదే పరిస్థితి నెలకొన్నది. అక్కడ కూడా జర్నలిస్టుల కంటే పోలీసులు, మార్షల్స్, అధిక సంఖ్యలో కనిపించారు. ఇలాంటి చర్యలు సబబు కాదని జర్నలిస్టులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మీడియా పాయింట్ వద్దకు ఎవరైనా ప్రతిపక్ష ఎమ్మెల్యేలు మాట్లాడేందుకు వస్తే.. వారి మాటలను ప్రత్యక్ష ప్రసారం చేయవద్దని అంటూ అసెంబ్లీ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ ఉదయమే వచ్చి కెమెరామెన్‌లకు, ఫొటోగ్రాఫర్లకు ఆదేశాలు జారీ చేశారు. గతంలో ఇలా లేదు కదా అని ప్రశ్నించగా.. పైనుంచి ఆదేశాలొచ్చాయని పాటించాల్సిందేనని చెప్పి వెళ్లిపోయారు.



న్యూఢిల్లీ కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో శుక్రవారం జాతీయ ఓబీసీ సెమినార్ జరిగింది. ఈ సెమినార్‌లో బీఆర్ఎస్ పార్టీ పార్లమెంటరీ పక్ష నేత కే కేశవరావు, రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, బీసీ నేత జాజుల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# టీజీవో నేతల మధ్య సఖ్యత

- రెండు సంఘాల మధ్య కుదిరిన సయోధ్య
- 10రోజుల్లో రాష్ట్ర కార్యవర్గ ఎన్నికలు
- రెండుమూడు రోజుల్లో షెడ్యూల్
- ఎన్నికల అధికారుల నియామకం

హైదరాబాద్, ఫిబ్రవరి 9 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం (టీజీవో)లో నెలకొన్న సందిగ్ధతకు తెరపడింది. రెండుగా విడిపోయి కార్యకలాపాలు కొనసాగించిన సంఘాలు తాజాగా ఏకతాటిపైకి వచ్చాయి. ఇటీవలే జరిగిన చర్చల్లో సఖ్యత కుదిరింది. దీంతో ఒకే సంఘంగా కొనసాగాలని నేతలు నిర్ణయించారు. మమత, ఏ సత్యనారాయణల నేతృత్వంలో తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం (టీజీవో) ఉండగా, రాష్ట్రంలో ప్రభుత్వం మారిన నేపథ్యంలో ఏలూరి శ్రీనివాస్‌రావు, శ్యాంల నేతృత్వంలో తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం సెంట్రల్ అసోసియేషన్ (టీజీవోసీఏ) వెలుగులోకి వచ్చింది. ఇటీవలే ఈ రెండు సంఘాల మధ్య సయోధ్య కుదిరింది. ఒకే సంఘంగా కార్యకలాపాలు నిర్వహణకు ఇరువర్గాలు అంగీకారానికి వచ్చాయి. కాగా, పది రోజుల్లో టీజీవో నూతన కార్యవర్గం ఎన్నిక కానున్నది. ఇందుకు షెడ్యూల్ రెండుమూడు రోజుల్లో విడుదలకానున్నది. నల్లగొండ ఆర్డీవో ఎన్ రవి ఎన్నికల అధికారిగా, కమర్షియల్ ట్యాక్సెస్ సరూర్‌నగర్ డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ సీ సంతప్‌కుమార్‌ను సహాయ ఎన్నికల అధికారిగా ప్రభుత్వం నియమించింది.

# ఒక్కో సెటిల్మెంట్‌కు రూ.కోటి

- ఓ ఐఏఎస్‌కు 10 కోట్లు అప్పగింత
- శివబాలకృష్ణ కేసులో విస్తుపోయే వాస్తవాలు
- తెరపైకి మరో ఇద్దరు మాజీ ఐఏఎస్‌లు
- వారిపైనా దృష్టి సారించిన ఏసీబీ
- విచారణ కోసం ప్రభుత్వానికి విజ్ఞప్తి
- నవీన్ డొల్ల కంపెనీలపైనా ఫోకస్

హైదరాబాద్, ఫిబ్రవరి 9 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో సంచలనం రేపుతున్న హెచ్ఎండీఏ మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణ అవినీతి వ్యవహారంలో విస్తుపోయే వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి. ఆయనను కస్టడీలోకి తీసుకుని గత 8 రోజులుగా విచారణ జరిపిన అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు.. న్యాయస్థానానికి సమర్పించిన కన్ఫెషన్ రిపోర్ట్‌లో పలు విషయాలను వెల్లడించారు. ఒక్కో భారీ సెటిల్మెంట్‌కు శివబాలకృష్ణ రూ.కోటి వరకు ముడుపులు తీసుకున్నాడని, ఆయన ద్వారా పురపాలక శాఖలో పనిచేసిన ఓ సీనియర్ ఐఏఎస్ అధికారి అడ్డగోలుగా అనుమతులు పొందాడని తెలుస్తున్నది. ఆ ఐఏఎస్ ఒత్తిడితో నార్సింగిలో 12 ఎకరాల వివాదాస్పద భూమికి శివబాలకృష్ణ క్లియరెన్స్ ఇచ్చినట్టు పేర్కొన్నారు. ఆ భూమిలో ఎస్ఎస్‌వీ ప్రాజెక్టుకు అనుమతి ఇప్పించేందుకు ఆ ఐఏఎస్ 10 కోట్లు డిమాండ్ చేయడంతో అడ్వాన్స్‌గా షేక్ సైదా అనే వ్యక్తి రూ.కోటి చెల్లించినట్టు సమాచారం. ఆ నగదు శివ బాలకృష్ణ ద్వారా ఆ ఐఏఎస్‌కు చేరిందని, వారిద్దరి మధ్య ఉన్న సఖ్యతతో ఆ ఐఏఎస్‌కు వెర్టెక్స్ హోమ్స్‌లో ఓ ఫ్లాట్‌ను రిజిస్ట్రేషన్ చేశారని తెలిసింది. శివబాలకృష్ణకు సంబంధించిన అక్రమాస్తుల పత్రాలను తనిఖీ చేస్తున్న క్రమంలో ఏసీబీ అధికారులకు మరో ఇద్దరు మాజీ ఐఏఎస్ అధికారుల ఆస్తుల పత్రాలు కూడా దొరికినట్టు సమాచారం. దీంతో వారికి నోటీసులు జారీ చేసి, విచారించాలని ఏసీబీ నిర్ణయించింది. అనుమతి నివ్వాలంటూ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. డీవోపీటీ అనుమతి లేకుండా ఇద్దరు మాజీ ఐఏఎస్‌లు అక్రమంగా మహబూబ్‌నగర్, యాదాద్రి జిల్లాల్లో ఆస్తులు కొన్నట్టు వార్తలొచ్చాయి. తన పేరు ఉండటంపై మాజీ ఐఏఎస్ అధికారి రజత్‌కుమార్ స్పందించారు. జీపీఏ పర్మిషన్‌తో 2013లో కొనుగోలు చేసిన భూమిని 2021లో అమ్మినట్టు వివరణ ఇచ్చారు. శివబాలకృష్ణ అక్రమాల్లో ఆయన సోదరుడు శివనవీన్‌కుమార్ కీలకంగా వ్యవహరించినట్టు ఏసీబీ వర్గాలు చెప్తున్నాయి.

అసభ్యకర భాష నియంత్రణకు

# చట్టం తేవాలి

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం



హైదరాబాద్, ఫిబ్రవరి 9 (నమస్తే తెలంగాణ): రాజకీయాల్లో వ్యక్తిగత దూషణలు, అసభ్యకరమైన భాషను నియంత్రించేందుకు ప్రత్యేక చట్టం తీసుకొనిరావాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సూచించారు. గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానాన్ని శుక్రవారం వీరేశం ప్రవేశపెట్టగా, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి బలపరిచారు. ఈ సందర్భంగా వేముల వీరేశం మాట్లాడుతూ.. కొందరు వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారని, వారి ప్రవర్తనను అదుపుచేసేలా సభలో తీర్మానం ప్రవేశపెట్టి ప్రత్యేక చట్టం రూపొందించాలని కోరారు. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలుచేసి తీరుతామని, తమకు ప్రజలు ఐదేండ్లు అవకాశమిచ్చారని అంత వరకు ఓపికపట్టాలని పేర్కొన్నారు.

### కర్రుకాల్చి వాతపెట్టే తెలంగాణ

రాష్ట్ర ప్రజల భవిష్యత్‌ను బంగారుమయం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. 'ఇది ఎడ్డి.. గుడ్డి తెలంగాణ కాదు.. కర్రుకాల్చి వాతపెట్టే తెలంగాణ' అని అభివర్ణించారు. సీఎం మంత్రులకు అధికారాలివ్వాలని, అధికారులు స్వేచ్ఛగా నిర్ణయాలు తీసుకునే పరిస్థితి ఉండాలని ఆకాంక్షించారు. స్కిల్ డెవలప్‌మెంట్, యువతకు ఉద్యోగాల కల్పనలో భాగంగా రాష్ట్రంలోని 50 ఐటీఐలకు రూ.2 వేల కోట్లతో స్కిల్‌డెవలప్‌మెంట్ సెంటర్లుగా మార్చబోతున్నట్టు తెలిపారు. థేమ్స్ నదిలా మూసి నదిని సుందరీకరిస్తామని చెప్పారు.

### సభ్యులకు సీట్ల కేటాయింపు

కొత్తగా అసెంబ్లీ కొలువుదీరిన నేపథ్యంలో సభ్యులు కూర్చోడానికి వీలుగా వారికి సీట్లను కేటాయించారు. సభ్యులంతా తమకు కేటాయించిన సీట్లల్లో కూర్చోవాలని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సభలో ప్రకటన చేశారు.



హైదరాబాద్ ఎన్టీఆర్ స్టేడియంలో జాతీయ పుస్తక ప్రదర్శనలో భాగంగా బుక్‌స్టాల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, చిత్రంలో జూలూరు గౌరీశంకర్ తదితరులు

# హైదరాబాద్‌లో జాతీయ పుస్తక ప్రదర్శన

- ఎన్టీఆర్ స్టేడియంలో ప్రారంభం

హైదరాబాద్ సిటీబ్యూరో, ఫిబ్రవరి 9 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో 36వ జాతీయ పుస్తక ప్రదర్శన ప్రారంభమైంది. 365 స్టాళ్లు కొలువుదీరిన ఈ ప్రదర్శనను 'పద్మశ్రీ' అవార్డు గ్రహీత కూరెళ్ల విఠలాచార్య శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం హైదరాబాద్ బుక్ ఫెయిర్ అధ్యక్షుడు జూలూరు గౌరీశంకర్ అధ్యక్షతన ప్రముఖ సంస్కృత పండితుడు రవ్వా శ్రీహరి వేదిక వద్ద జరిగిన కార్యక్రమంలో వక్తలు ప్రసంగిస్తూ.. పుస్తక ప్రాధాన్యతను వివరించారు. మనిషిలోని సకల రుగ్మతలకు విరుగుడు పుస్తకమేనని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతి శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. పుస్తకంతోనే మనిషి పరిపూర్ణుడవుతాడానని, ఏ ఇంట్లో పుస్తకం ఉంటే ఆ ఇంట్లో ఓ పుణ్యాత్ముడు తోడున్నట్టేనని విఠలాచార్య అన్నారు. 'దేవుని రాజ్యం నీలోనే ఉంది' అనే పుస్తకం చదవడం వలన గాంధీజీ మహాత్ముడయ్యాడని చెప్పారు. 'ఆంధ్రజ్యోతి' సంపాదకుడు కే శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అనేక గ్రంథాలయాలు మూతపడే స్థితిలో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 36 ఏండ్ల నుంచి నిరంతరాయంగా ఈ పుస్తక ప్రదర్శన కొనసాగడం గొప్ప విషయమని 'వీక్షణం' ఎడిటర్ ఎన్ వేణుగోపాల్ అన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు జూలూరు గౌరీశంకర్, రాష్ట్ర సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, 'నవ తెలంగాణ' పత్రిక సంపాదకుడు సుధాభాస్కర్, 'ప్రజాపక్షం' పత్రిక ఎడిటర్ శ్రీనివాసరెడ్డి, ప్రజా గాయకుడు గద్దర్ కుమార్తె వెన్నెల తదితరులు పాల్గొన్నారు.